

'ఐతమ్'లో ఎన్‌సిసి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటైన ఎన్‌సిసి విభాగంలో మూడేళ్లపాటు శిక్షణకు బిటెక్‌కు చెందిన మొదటి ఏడాది విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. 14వ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ గిరీష్ హెచ్‌ఎన్, హవల్దార్ మల్లేశ్వరరావు నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ నిర్వహించారు. 62 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, లెఫ్టినెంట్ టి.మురళీకృష్ణ, ట్రైనర్ ఎస్.భుజంగరావు, పలువురు డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

రుణం తీసుకోకున్నా నోటీసులు



బూర్జ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం



- సెంటు భూమి లేకున్నా అప్పు ఇచ్చినట్లు నమోదు
- బూర్జ పిఎసిఎస్‌లో చిత్రవిచిత్రాలు

బూర్జ పిఎసిఎస్‌లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. రుణం తీసుకోకున్నా రైతులకు నోటీసులు ఇస్తున్నారు. భర్త పేరుతో అప్పు తీసుకుంటే భార్య పేరునూ రుణాల జాబితాలో చేర్చారు. సెంటు భూమి లేని వారికీ అప్పు ఇచ్చినట్లు చూపారు. రైతులు తమవంతు చెల్లించిన షేర్ క్యాపిటల్ సొమ్ములూ సొసైటీ ఖాతాలో మాయమైనట్లు చర్చ నడుస్తోంది. పిఎసిఎస్‌లో సొమ్ములు పక్కదారి పట్టిన వైనంపై 'ప్రజాశక్తి' కథనం చర్చనీయాంశమైంది. ఈ కథనంతో మరికొంతమంది బాధిత రైతులు బయటకు వస్తున్నారు. తమ పేరుతో ఎంత అప్పు ఉందో బూర్జ పిఎసిఎస్, పాలకొండలోని డిసిసిబికి వెళ్లి ఆరా తీస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం ఉవ్వపేటకు చెందిన రైతు బుల్లి పాపారావు బూర్జ పిఎసిఎస్‌లో రూ.44,702 అప్పు తీసుకున్నారు. వడ్డీ సొమ్ముగా ప్రతి ఏడాది రూ.1788 చెల్లిస్తున్నారు. వడ్డీ డబ్బులు కడుతున్నా చెల్లించనట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈయన భార్య లీలావతి పేరున సెంటు భూమి కూడా లేదు. అయినా ఆమెకు రూ.68,828 అప్పు ఇచ్చినట్లు చూపారు. వడ్డీ సొమ్ముగా రూ.2,750 చెల్లించాలని అడుగుతున్నట్లు బాధితులు చెప్తున్నారు. అల్లెనకు చెందిన జడ్డు అమ్మన్న 2014లో రూ.12,495 తీసుకున్నట్లు, వడ్డీ కింద రూ.1707 చెల్లించాలంటూ 15 రోజుల కింద సొసైటీ సిబ్బంది ఆమె ఇంటికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆశ్చర్యపోయారు. తాము అప్పు తీసుకోకపోయినా డబ్బులు కట్టాలని ఎలా అడుగుతారంటూ ఎదురుతిరిగారు.

నమ్మించి వంచించారు

సొసైటీ ద్వారా తీసుకున్న రుణాలకు రైతులు వాయిదాల పద్ధతిలో సొమ్ము చెల్లించడమో, సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకోవడమో ఇప్పటివరకు చేస్తూ వస్తున్నారు. సిబ్బందిపై నమ్మకంతో కొంతమంది ఇళ్లకు వచ్చిన సిబ్బందికే నేరుగా డబ్బులు ఇచ్చేస్తున్నారు. రశీదులు అడిగితే తర్వాత ఇస్తామంటూ సిబ్బంది బదులివ్వడంతో, వారిపై నమ్మకంతో రైతులు పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు అదే వారి కొంపముంచింది. రశీదులు లేకపోవడంతో వారు డబ్బులు ఇచ్చేసినా, చెల్లించనట్లుగానే రికార్డుల్లో ఉంది. చెల్లించిన సొమ్ములకు రశీదులు లేకపోవడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడం లేదు.

షేర్ క్యాపిటల్ సొమ్ము మాయమే

కొంతమంది రైతులు కట్టిన షేర్ క్యాపిటల్ సొమ్ము సొసైటీ ఖాతాకు జమ కాలేదని తెలుస్తోంది. అల్లెనకు చెందిన మాజీ సర్పంచ్ బాలచంద్ర మౌళీశ్వరరావు రూ.రెండు లక్షల రుణం తీసుకునేందుకు ఈ ఏడాది మేలో రూ.28 వేలు షేర్ క్యాపిటల్‌గా రూ.28 వేలు కట్టారు. సిబ్బంది ఎవరికైనా ఇస్తే జమ అవుతుందో, లేదోనని స్వయంగా తానే చైర్మన్ బగాది నారాయణమూర్తికి అందించినట్లు ఆయన చెప్తున్నారు. ఇదిగో, అదిగో లోన్ అంటూ కొద్దిరోజులు నాన్చారు. డబ్బులు ఏమయ్యాయో తెలియదు, తర్వాత వసూలు చేసి ఇస్తాం, మరోసారి షేర్ క్యాపిటల్ ఇవ్వాలంటూ చైర్మన్ సూచించడంతో మరోసారి రూ.28 వేలు ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన గొర్లె క్రిష్ణమూర్తి నాయుడుదీ అదే పరిస్థితి. షేర్ క్యాపిటల్ ఇచ్చినా ఇప్పటివరకు రుణం మంజూరు కాలేదు.

చర్చనీయాంశమైన ప్రజాశక్తి కథనం

బూర్జ పిఎసిఎస్‌లో చోటుచేసుకున్న నిధుల అవకతవకలపై ఈనెల 12న ప్రజాశక్తి జిల్లా పేజీలో 'పిఎసిఎస్ సొమ్ములు పక్కదారి' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో కథనం క్లిప్పింగ్ విస్తృతంగా సర్క్యులేట్ అయింది. దీంతో బాధితులు మరింత మంది బయటకు వస్తున్నారు. తమ పేరుతో బాకీ ఎంత ఉందో తెలుసుకునేందుకు సొసైటీకి వెళ్లి ఆరా తీస్తున్నారు.

డిసిసి అధ్యక్షులుగా 'పేడాడ'

ప్రజాశక్తి - టెక్కలి రూరల్



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బొడ్డేపల్లి సత్యవతి నియమితులయ్యారు. ఈమేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఉత్తర్వులు విడుదల చేశారు. పేడాడ పరమేశ్వరరావు జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించారు. సీనియర్ పాత్రికేయునిగా, ప్రజాసంఘాల నాయకునిగా, ఎపిసిఎల్‌పి అధ్యక్షునిగా, నౌపడ, గుణుపూర్ రైలు ఉద్యమ పోరాట కమిటీ నాయకుడిగా, అభ్యుదయ రచయితగా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్నాయి. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పనిచేసి 2010లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అప్పట్నుంచీ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయన, మూలపేట పోర్టు రైతాంగం కోసం పోరాటం చేస్తున్నారు.

డిసిసి అధ్యక్షునిగా తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో డిసిసి అధ్యక్షులుగా పనిచేసిన వారి స్ఫూర్తితో అందరినీ కలుపుకుంటూ ముందుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే ఈ దేశంలో అభివృద్ధి, సుస్థిరత సాధ్యమవుతుందన్నారు. పరమేశ్వరరావు నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.



మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వైద్యాధికారులను ఆదేశించారు. మాతా మరణాల నివారణ కార్యక్రమంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతా మరణాల నివారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్యులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద పరిస్థితిలో ఉన్న వారిని ఆలస్యం చేయక సరైన సమయంలో సమీపంలోని ఉన్నత స్థాయి ఆస్పత్రికి రిఫర్ చేసి ప్రమాదకర పరిస్థితి నుంచి రక్షించగలగాలన్నారు.

రక్తహీనత తలెత్తకుండా ముందుగానే గర్భిణుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. శిశు మరణాలపైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ శాంతిశ్రీ, అదనపు డిఎంహెచ్‌ఒ అనురాధ, పిహెచ్‌సిల వైద్యాధికారులు, మాతా మరణాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ జాగిలానికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యాన మంగళగిరి ఆరో బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి కెన్నన్ అండ్ డాగ్ హ్యాండ్లర్ పునశ్చరణ ప్రత్యేక శిక్షణలో జిల్లా పోలీసు జాగిలం బ్యూటీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. శిక్షణనకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 35 జాగిలాలు, 54 మంది డాగ్ హ్యాండ్లర్స్ పాల్గొన్నారు. మన జిల్లా నుంచి ఎక్స్‌ప్లోజివ్ శిక్షణలో బ్యూటీ, నార్కోటిక్ శిక్షణలో రాణి పాల్గొన్నాయి. ఇందులో భాగంగా ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో బ్యూటీ జాగిలానికి ద్వితీయ స్థానం లభించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు జాగిలాలతో కలిసి డాగ్ హ్యాండ్లర్స్ ఎస్‌పి జి.ఆర్ రాధికను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోలీసు జాగిలాలు, హ్యాండ్లర్లను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర పరిశోధనకు, నియంత్రణకు, తీవ్రవాద చర్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన శిక్షణ జాగిలాలకు ఇచ్చినట్లు తెలిపారు. జాగిలాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుని జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. జిల్లా పోలీసు శాఖకు మరింత మెరుగైన సేవలు అందించేలా పోలీసు జాగిలాలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్, హ్యాండ్లర్స్ రుషి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అడ్డు తొలగించేందుకు కుట్ర

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా క్షేత్రంలో అడ్డు తొలగించేందుకు కుట్ర చేస్తోందని కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పథకం ప్రకారం చంద్రబాబును ప్రజా క్షేత్రం నుంచి దూరం చేయాలని అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందుకొచ్చి సుద్దులు మాట్లాడుతున్నారని, తన స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలన్నారు. చంద్రబాబుకు ఎన్‌ఎస్‌జి భద్రత లేకుండా చేయడానికే తప్పుడు కేసులతో జైలుకు పంపించారని వ్యాఖ్యానించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉద్దేశపూర్వకంగానే కలుషిత నీరు అందజేస్తూ కర్కశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జైల్లో ఉన్న ఆయన అస్వస్థతకు గురైనా, బరువు తగ్గినా ఆయన మెడికల్ రిపోర్టులను మార్చి విడుదల చేస్తున్నారని చెప్పారు. జైల్లో ఉక్కపోత, అనారోగ్య సమస్యలతో డీ హైడ్రేషన్‌తో చంద్రబాబు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలోని వైద్యుల నివేదికలు నమ్మడానికి వీల్లేదన్నారు. చంద్రబాబుకు వైద్యం అందించకుండా జైల్లో చంపాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు విడుదల చేయాల్సిన హెల్త్ బులిటెన్లు జైలు అధికారులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రాణానికి ఎటువంటి హాని జరిగినా తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు పి.ఎం.జె బాబు, బొనిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

రౌడీషీటర్ల కదలికలపై దృష్టి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రౌడీషీటర్ల కదలికలపై దృష్టిసారించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రేవ్ కేసులు, రౌడీషీటర్ల వివరాలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రేవ్ కేసుల నమోదు, దర్యాప్తుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో సమగ్రమైన దర్యాప్తు చేపట్టి కచ్చితమైన సాక్ష్యాధారాలతో కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలని, యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లపై దృష్టిపెట్టాలని, సత్ప్రవర్తనతో నడుచుకునేందుకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు వై.శృతి, నాగేశ్వర్ రెడ్డి, ఎస్.బాలరాజు, సిఐలు పాల్గొన్నారు.



చదువును మించిన ఆయుధం లేదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చదువును మించిన ఆయుధం లేదని ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజాన్ని మార్చడానికి చదువు ఒకటే శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం సాధించిన విజయాలే చదువు విలువని తెలిపేందుకు నిదర్శనమన్నారు. అననుకూల పరిస్థితుల్లో ఏ వసతుల్లేని సమయంలో బాల్యం నుంచి విద్య పూర్తయ్యే వరకు అనేక కష్టాలు పడి ఉన్నత చదువులు అభ్యసించారని వివరించారు. అందుకే చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చదువుకునే సమయంలో సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులపై గౌరవభావంతో మెలగాలన్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా మహిళలు ఎదుగుతున్నారని, ఆ విధంగా ప్రతి బాలిక ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఇప్పటికే దానేటి శ్రీధర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.20 లక్షల ఫండ్‌తో పేద విద్యార్థులకు చేయూతని అందిస్తున్నామని వివరించారు. కళాశాలలో ఏ అవసరమైనా తనను నేరుగా కలవచ్చని అధ్యాపకులు, విద్యార్థులకు భరోసానిచ్చారు. అనంతరం డాక్టర్ దానేటి శ్రీధర్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన సినీ గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఉపాధికల్పన అధికారి సుధ, ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సిహెచ్.కృష్ణారావు, టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

తాగునీటికి అధిక ప్రాధాన్యత

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నెల్లిపర్తి, గొల్లపేటలో సుమారు రూ.79 లక్షలతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిల ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికీ జల జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నీటి వనరులను రక్షించుకోవాల్సిన అవసరం, నీటిని పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి మానుకొండ ధనలక్ష్మి, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, సర్పంచ్‌లు చిలకలపల్లి సురేష్, సోమరాజు తేజ, వైసిపి నాయకులు తిర్లంగి రామారావు, మానుకొండ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి నవీన్

విపత్తులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, ఆ దిశగా ప్రజలు అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహనా ర్యాలీని జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిసారి ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనేక రకాలుగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. నష్ట నివారణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, బి.చిన్మయరావు, సమన్వయకర్త కె.సత్యనారాయణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచారు

తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి రామ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖలో ఇన్ఫోసిస్ సంస్థ వచ్చేసిందని, ఇక ఉద్యోగాలు వచ్చినట్టేనని చెప్తున్న మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో ఎందుకు చెప్పడం లేదని తెలుగు శక్తి రాష్ట్ర అధ్యక్షులు బి.వి రామ్ ప్రశ్నించారు. నగరంలోని ఒక హోటల్‌లో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఉద్యోగులను తీసుకొచ్చి ఇక్కడ మౌలిక సదుపాయాలను వినియోగించుకునేలా సంస్థకు విడిది మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర యువతకు వచ్చిన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇన్ఫోసిస్‌లో కొత్తగా ఉత్తరాంధ్ర యువతకు ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని, పవన్ కళ్యాణ్‌పై ఆయన మాట్లాడుతున్న తీరు అందుకు అద్దం పడుతోందన్నారు. సుదీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులపై నెగ్గాలని ప్రయత్నించడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, కోరాడ హరగోపాల్, బి.రాజేష్ రెడ్డి, గాలి వెంకట్‌రెడ్డి, బి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో ప్రజా వైద్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వసతులతో ప్రజా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఎస్‌విడి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది బాగా పనిచేస్తేనే ప్రభుత్వానికి పేరు వస్తుందన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వాస్పత్రుల్లో అందించిన సేవలతో ఎంతోమంది ప్రాణాలు కాపాడగలిగారన్నారు. వైద్య, విద్య రంగాలకు ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, వైసిపి నాయకులు మండవిల్లి రవి, కొండల గణేష్, బరాటం సంతోష్, అప్పన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి అవకాశాలను అన్వేషించాలి

శ్రీకాకుళం లీగల్ : ఉపాధి అవకాశాల కోసం ట్రాన్స్‌జెండర్లు అన్వేషించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని న్యాయ సేవాసదన్‌లో విద్యావంతులైన ట్రాన్స్‌జెండర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులైన ట్రాన్స్‌జెండర్లు ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఇతర విద్యార్హతలు ఉన్న ట్రాన్స్‌జెండర్లు సైతం తగిన ఉపాధి కోసం అన్వేషించి ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఖ్యాతి ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలో నిర్వహిస్తున్న వృద్ధ జనాశ్రమాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సందర్శించారు. వృద్ధులకు పళ్లు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.ఫల్గుణరావు, గేదెల ఇందిరాప్రసాద్, ఖ్యాతి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ఆరోగ్య సురక్ష లక్ష్యం


పొందూరు : పాల్గొన్న చిరంజీవి నాగ్


పలాస: వైద్య శిబిరంలో పాల్గొన్న పైల వెంకటరావు చిట్టి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజారోగ్య సంరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని తోటాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు చేరువ కావడానికి ఇప్పటికే అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రజల ముంగిటకు వైద్య సేవలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని పరిష్కరించే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుందన్నారు. దీనిలో భాగంగానే తోటాడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, సర్పంచ్‌లు మెట్ట శారద, గురుగుబెల్లి నీలారావు, మండల గ్రామ సచివాలయ కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, వైసిపి నాయకుడు బెండి రమణ, మాజీ ఎంపిటిసి బెండి శ్యామలరావు, వైద్యులు బాలచందర్, లీసా, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కోటపాలేం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు సుమన్, గిరిబాబు, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలం కేసుపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి సమన్వయకర్త పిరియ సాయిరాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, సల్ల దేవరాజ్, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, కారంగి మోహనరావు, ఉప్పడ రాజారెడ్డి, నీలాపు చంద్రయ్య, రంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం చిన్న తుంగాం పంచాయతీలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జడ్పిటిసి పాల వసంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, వైద్యాధికారులు హేమంతలక్ష్మి, పావని, స్థానిక సర్పంచ్ బెజ్జి కూర్మారావు, పెద్దింటి భాగ్యం, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి: పల్లిపేట పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి భూస రమణారెడ్డి, డిటి శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉషశ్రీ, వైసిపి నాయకులు తూలుగు అశోక్ కుమార్, లండ యర్రయ్య, వై.ధర్మారావు, మూర్తి, కె.లక్ష్మణరావు, వైద్యులు శ్రీనాథ్ రత్నం రాజు, చందనం, విస్తరణ అధికారి ఎన్. రవికుమార్, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపు కొత్తూరు: గునుపల్లిలో జగనన్న వైద్య శిబిరాన్ని జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ తిర్రీ లక్ష్మి నారాయణ ఎంపిటిసి తిర్రి రాజారావు, గ్రామపెద్దలు నిరంజన్, టి. శ్రీను, ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, సచివాలయ కార్యదర్శి యాదవరాజు, అక్కుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి దువ్వాడ దివ్య, రంగనాథరావు, రిమ్స్ వైద్యులు విద్యాసాగర్, గౌతమి, తారకేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: మండలం బెజ్జిపుట్టుగ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌తో కలిసి సాయిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణ స్వామి, దుగాన భద్రాచలం, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎన్ని అశోక్, డి.మోహనరావు, బెందాలం రమణమూర్తి, ప్రవీణ్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, అంగన్వాడీ సూపర్ వైజర్ కృష్ణవేణి, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: మండలం కల్లాడ గ్రామంలో సర్పంచ్ మడపాల తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగ నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు.

ఫోటో. పరిశీలిస్తున్న తిలక్

బూర్జ: మండలంలో కొల్లువలస అంబేద్కర్ గురుకుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, వైస్‌ఎంపిపి బుడుమూరు సూర్యారావు, స్థానిక సర్పంచ్‌లు బూరి శ్రీరామ్మూర్తి, గడే వేణు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు తూర్పు ఉదయ్ కుమార్, మామిడి శ్రీనివాసరావు, గుత్తావల్లి పిహెచ్ వైద్యాధికారులు రమ్యశ్రీ, రోజా, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో జగన్నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం నాయకులు, వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, ఎంపిడిఒ ఎం.పావని, వైసిపి నాయకులు అగతముడి రంజిత్ కుమార్, కోయిలాపు సంజీవరావు, సవర.రమేష్ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: శిబిరంలో ఎమ్మెల్సీ రామారావు, సాయిరాజ్


ఆమదాలవలస : మందులను పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని

పొందూరు: మండలం గోరింట గ్రామంలో కింతలి పీహెచ్‌సి ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, వైసిపి నాయకులు రాణా ప్రతాప్, బండారు జైప్రతాప్‌కుమార్, గాడు నాగరాజు, వైద్యాధికారులు శివశంకర్, జి.రమేష్‌నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, సర్పంచ్ బి.పుష్ప, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, వెంకటాపురం పిహెచ్‌సి వైద్యాధికారి అంజలి, వైద్యులు స్వరాజ్యలక్ష్మి, నర్సింగరావు, ప్రశాంతి, ఎంపిడిఒ ఎన్ రమేష్ నాయుడు, వైసిపి నాయకులు మచ్చ ధనరాజ్, బమ్మిడి దుర్యోధన, కొర్ల సంతు, దువ్వాడ రవి కుమార్, పినకాన ముకుంద, సల్ల కామరాజు, ఆనం రామారావు, పొందర శ్రీను పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సాయిరాజ్, నర్తు రామారావు

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో కేసుపురం గ్రామ పంచాయతీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలం కేసుపురం పంచాయతీ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. గ్రామంలో రూ.5 లక్షల జెడ్‌పి నిధులతో నూతనంగా మంజూరు కాబడిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్, అదే విధంగా కేసుపురం పంచాయతీలో రూ.4 లక్షలు జెడ్‌పి నిధులతో బస్సు షెల్టర్‌ను, గ్రామంలో 3 లక్షల గడప గడపకు నిధులతో విశ్రాంత భవనాన్ని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసన సభ్యులు పిరియా సాయిరాజ్ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, మండల జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, సల్ల దేవరాజ్, దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, కారంగి మోహనరావు, ఉప్పడ రాజారెడ్డి, నీలాపు చంద్రయ్య, జి హేమంత్ పాల్గొన్నారు.



సత్కరిస్తున్న శోభారాణి

వికలాంగులకు లయన్స్ క్లబ్ సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యం శాపం కాకూడదని, అంధత్వాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో విజయపథాన ఎన్నో విజయాలను సాధిస్తున్న వారు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలు పొందాలని హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కరణం శోభారాణి అన్నారు. శ్రీకాకుళం హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆద్వర్యాన శుక్రవారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభావంతులైన వికలాంగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, దఢ సంకల్పం శారీరక వైకల్యాన్ని జయిస్తాయన్నారు. హర్షవల్లి లయన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హారికాప్రసాద్) మాట్లాడుతూ అంగవైకల్యం కేవలం అవయవలోపం మాత్రమేనన్నారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పట్నుంచి ఆరోగ్య జాగ్రత్తలు వహిస్తే అవయవ లోపాల్లేకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మణిశర్మ, వావిలపల్లి జగన్నాథ నాయుడు, తర్లాడ అప్పలనాయుడు, రౌతు శ్రీనివాసరావు, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలాజీ నాయక్

శతశాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- బూర్జ

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ శ్రీకాకుళం సమన్వయాధికారి ఎస్.బాలాజీ నాయక్ అనుభవజ్ఞులైన ప్రధానాచార్యులు, సిబ్బంది గత నాలుగు రోజులుగా జిల్లాలో ఉన్నటువంటి డా బిఆర్ అంబేద్కర్ గురుకులాలను సందర్శించారు. దానిలో భాగంగా శుక్రవారం కొల్లివలసలో డా. బిఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంను సందర్శించి రికార్డులను, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోవు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు ప్రతి ఒక్క విద్యార్థికి రావాలని, అందుకు తగిన విధంగా కృషి చేయాలని ఆదేశించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి తోటి విద్యార్థుల్లా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో దువ్వాడ దేవేంద్రరావు, బుచ్చి రాజు, నూక రామకష్ణ, రామమూర్తి ఉన్నారు.


ప్రియమణిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

క్రీడాకారిణికి అభినందన

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ గోల్డ్‌మెడల్ విజేత ప్రియమణిని గ్రీన్‌ఆర్మీ, విద్యావాహిని కళాశాల యాజమాన్యం అభినందించారు. కర్నూలు జిల్లా మహానందిలో ఇటీవల జరిగిన సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గ విద్యా వాహిని కళాశాల విద్యార్థిని శిస్టు ప్రియమణి గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా కళాశాలలో గ్రీన్‌ఆర్మీ, కళాశాల యాజమాన్యం మెమోంటో, మొక్క, దుశ్శాలువతో అభినందించారు.ఈ సందర్భంగా సినీనటులు అమ్మ రామకృష్ణ మాట్లాడుతూ గెలుపు, ఓటములు మనిషికి చాలా పాఠాన్ని నేర్పిస్తాయని, కృంగిపోకుండా లక్ష్యంతో ఉంటే విజయాన్ని సాధించవచ్చని, పాటలతో, మాటలతో అలరించి విద్యార్థులకు తెలియజేశారు, కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, వివిధ రంగాలలో రాణించాలంటే కృషి, పట్టుదల, దీక్ష, క్రమశిక్షణ, గురువులు చెప్పేవి ఆచరిస్తే ఏమైనా సాధించవచ్చు అని తెలియజేశారు. తద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి, గురువులకు మంచి పేరు తెచ్చే విధంగా విద్యార్థులు మెలగాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాలరావు, ఇరిగేషన్ అధికారి పి. శ్రీనివాసరావు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు రెయిన్బో డిజిటల్ నూకల హేమసుందర్, కళాశాల డైరెక్టర్ గిరిబాబు, మన్మధరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడిట్ అధికారిగా చరణ్ ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ గురువారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో టెక్కలి మండలం బలరాంపురం గ్రామానికి చెందిన దివ్వల చరణ్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో భాగంగా ఆల్ ఇండియాలో 33వ ర్యాంకు సాధించారు. గతంలో ఈయన పంచాయతీ సెక్రెటరీగా, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్(2021), ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా (2022), దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా(2023) విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఈయన గుంటూరులో ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ప్రస్తుతం అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఆంధ్రప్రదేశ్ విభాగానికి(కాగ్) ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి మల్లేశ్వరరావు ప్రైయివేట్ ఉద్యోగిగా, తల్లి శార్వాణి గృహిణిగా ఉన్నారు. చరణ్ 10వ తరగతి వరకు ఎపి రెసిడెన్షియల్ స్కూల్ సింహాచంలో, బిటెక్ జిఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ రాజాంలో చదువుకున్నారు. తల్లిదండ్రులు గ్రూప్-1 ఉద్యోగిగా స్థిరపడాలన్న ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షిస్తున్నారు

హక్కులపై అవగాహన అవసరం

పలాస: మానవ హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పలాస సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి మల్లా చక్రవర్తి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం పలాస మండల లీగల్ సర్వీస్ ఆథారిటి, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు జడ్జి చక్రవర్తి మల్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడుకి మానవ హక్కుల్లో భాగంగా కొన్ని హక్కులు కలిగి ఉంటాయని, వాటిపై అవగాహన పెంచుకొని వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు హ్యూమన్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఫయాద్ అహ్మద్, రవికుమార్, కోత రజనికుమార్, కోమార దేవరాజు, శ్యామ్, గణేష్, హెడ్ మాస్టర్ చిన్నం నాయుడు, ఉపాధ్యాయులు అప్పారావు, లక్ష్మణరావు, జనార్ధన్, రామారావు, శరత్, మోహనరావు పాల్గొన్నారు


మాట్లాడుతున్న జడ్జి చక్రవర్తి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు

సిహెచ్‌సి సిబ్బందిపై డిసిహెచ్‌ఒ ఆగ్రహం

పొందూరు: ఆస్పత్రిలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని డిసిహెచ్ఒ డా.జె.భాస్కరరావు హెచ్చిరించారు. పొందూరు సీహెచ్‌సీలో గతనెల 16వ తేదీన జి.సిగడాం మండలం చెట్టు పొదిలాంకు చెందిన పాముకాటు బాధితునికి చికిత్సను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై శుక్రవారం ఆస్పత్రిలో ఆయన విచారణ జరిపారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులను పిలిపించి విచారణ జరిపారు. ఆస్పత్రికి వచ్చిన పాముకాటు బాధితునికి సకాలంలో చేయాల్సిన చికిత్సను చేయకుండా శ్రీకాకుళం రిఫర్ చేయడంతో అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు తెలియజేశారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి భాద్యులైన అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలంటూ తెలిపారు. దీనిపై కమిటీ వేసి వారు అందించిన నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని బాదిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.-


బాధిత కుటుంబసభ్యులను విచారణ చేస్తున్న డిసిహెచ్ఒ

15లోగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

ఇ క్రాప్ట్ సామాజిక పనికి గ్రామస్థాయిలో నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి వి. శ్రీకాంత్ వర్మ అన్నారు. నందిగామ రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు భరోసా అందని వారు ఈనెల 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ మండల సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు

ప్రజాశక్తి- లావేరు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చెయ్యడంతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జెఆర్ పురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ఆదాం హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం సుభద్రపురం కూడలిలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న 40 మందిని నిలుపుదల చేసి వారినుంచి అపరాధ రుసం వసూలు చేశారు. ఈసందర్భంగా వారికి అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయణిస్తే అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే జరిగే నష్టం, హెల్మెట్ ఉంటే వుండే ప్రయోజనం కోసం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవడంతో పాటు కుటుంబంతో సంతోషంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో లావేరు సబ్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సిబ్బంది వున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పుస్తక పఠనంతో విజ్ఞానం సాధ్యపడుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రేవాడ దేవరాజు అన్నారు. శుక్రవారం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంచార పుస్తకాలయం శుక్రవారం పట్టణానికి చేరుకుంది. స్థానికంగా విక్రయాలను స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్ష్యులు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ రేవాడ దేవరాజు ప్రారంభించారు. ఆయనతో పాటు న్యాయవాది నాగరాజ్మా పాత్రో, మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి కోట రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం సాధ్యమని, విద్యార్థులు, యువత సదావకాశాన్ని వినియోగించుకోవటం ఉత్తమమన్నారు. సంచార పుస్తకాలయ నిర్వాహకులు నశీర్ ఖాన్ బార్ అసోసియేషన్ అధ్యక్ష్యునికి ప్రత్యేక పుస్తకాన్ని అందజేశారు..


ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవరాజు

జెడ్‌పి హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం


నౌపడ : తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జయకృష్ణ

ప్రజాశక్తి- బూర్జ


మండలంలో కె.కె. రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాన్ని హెచ్ఎం వై.మాలతి శుక్రవారం నిర్వహించారు. ప్రతి విద్యార్థి హాజరు, విద్యార్థి ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం హెచ్ఎం స్కూల్‌లో చేస్తున్న కార్యక్రమాలపై తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థులకు హైస్కూల్లో ఇచ్చిన హోంవర్క్ ఇంటి దగ్గర చదివించిన రోజే మంచి ఫలితాలు వస్తాయని ఆమె అన్నారు. అలాగే మండలంలో అన్ని స్కూళ్లలో కన్నా కె.కె.రాజపురం జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడల్లో మంచి ప్రోత్సాహం కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరు విద్యతో పాటు క్రీడలకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాలి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోత చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులను టీవీలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. నౌపడలో జగన్నాథపురం ఎంపిపిఎస్ పాఠశాలలో హెచ్ఎం జయ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, ఔట్‌సోర్స్ ఉద్యోగులకు శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డెత్ క్లెయిమ్‌లు, పీఎఫ్, ఇఎస్ఐ, వేతన బకాయలుపై నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో మున్సిపాలిటీకి చెందిన అనేక మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరిచి సత్వరమే కేసులు పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ బొంగి నాగప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు ఆప్కాస్‌లో పనిచేసే ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కోసం విజయవాడ వెళ్లి వచ్చేవారని, కార్మికుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రధాన మున్సిపాలిటిల్లో గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డి.పవనకుమార్, బి. నరేష్ పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌లో వినతులు అందిస్తున్న ఉద్యోగులు

విద్యార్థులకు 'బిగ్ హెల్ప్' సహాయం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాలి మండలం నౌపడ ప్రభుత్వ హైస్కూల్లో చదువుతున్న 15 మంది నిరుపేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫౌండేషన్ తరపున శుక్రవారం చెప్పులను అందించారు. ఈ సందర్భంగా నౌపడ ప్రాజెక్టు చైర్మన్ సివి రాజా మాట్లాడుతూ సంస్థ తరపున పేద విద్యార్థులను గుర్తించి ఆర్థికంగా, విద్యాపరంగా, అవసరమైన వస్తువులను ప్రతినెలా అందిస్తున్నామని తెలిపారు.

సంస్థ తరపున సహాయం పొందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివారన్నారు. నిరుపేద విద్యార్థులను గుర్తించి వారు ఉన్నత చదువులు చదివేందుకు సంస్థ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎం. భాను ప్రకాష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్. కష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖోఖోకు జ్ఞానభారతి విద్యార్థులు

ఇచ్ఛాపురం : జ్ఞాన భారతి సీనియర్ సెకండ్రీ విద్యార్థులకు-దక్షిణ భారత క్లస్టర్ ఖోఖో పోటీలకు వెళ్తున్న సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు. శుక్రవారం జ్ఞాన భారతి విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా రావాలని విద్యా సంస్థలు కార్యదర్శి జోహర్ ఖాన్ అభినందించారు. ఈ నెల 14న తునిలో శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్‌లో క్లస్టర్ ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఈ విద్యా సంస్థలు నుండి 24 మంది విద్యార్థులతో పాటు సూపర్ వైజింగ్ చేయు వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా తదితరులు పయనమయ్యారు. ట్రస్టీ వి.రమణ మూర్తి, ప్రిన్సిపల్ ఐ.బి పండా, ఎఒ సర్తాజ్ ఖాన్, ప్రమోద్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.


ఎంపికైన జ్ఞానభారతి విద్యార్థులు


వినతిపత్రం అందజేస్తున్న కలిశెట్టి

తోటపల్లి ఆయకట్టుకు సాగునీరివ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని తోటపల్లి, నారాయణపురం కుడి కాలువ శివారు ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలని టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను శుక్రవారం రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నారాయణపురం ఆయకట్టుకు సాగునీరు ఇంతవరకు విడుదల చేయకపోవడంతో నాట్లు వేసుకోలేని దుస్థితి ఎదురైందన్నారు. వర్షాధారంతో నాట్లు వేసిన పంట పొలాలు ఇప్పుడు పొట్ట దశలో నీరందడం లేదని వివరించారు. తోటపల్లి ఆయకట్టుకు తక్షణమే సాగునీరివ్వాలని కోరారు.

సినీఫక్కీలో చోరీ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో సినీ ఫక్కీలో శుక్రవారం చోరీ జరిగింది. ద్విచక్ర వాహనం డిక్కీలో ఉన్న రూ.20 వేలు నగదు, విలువైన పత్రాలను దొంగలు పట్టుకుపోయారు. బాధితులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గకు చెందిన మన్మధరావు యూనియన్ బ్యాంక్ వద్ద రూ.20 వేలు విత్ డ్రా చేసుకొని తన ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టి మరలా బ్యాంకు లావాదేవీలపై వెళ్ళగా డిక్కీలో ఉన్న నగదును సినీ ఫక్కీలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నెంబరు ఫేట్‌లేని వాహనంలో వచ్చి నగదును దొంగిలించారు. అదే తరహాలో కాశీబుగ్గకు చెందిన మరో వ్యక్తి ఎం.ప్రకాశరావు, ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి టిఫెన్ దుకాణం వద్దకు వెళ్లేసరికి ఇంతలో డిక్కీలో ఉన్న విలువైన పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకాలు దొంగిలించారు. ఇదిలా ఉండగా పై తరహాలో కాశీబుగ్గకు చెందిన వ్యక్తి తన వాహనంలో రూ. 1.10 లక్షలు, బంగారపు చైన్ దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు అడగడంతో ఆయన వెళ్లి పోయినట్లు పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఆడంగి రవితేజ అనే 14ఏళ్ల బాలుడు ఈనెల 9వ తేదీ నుంచి కనిపించడంలేదని బాలుడి తండ్రి కాళిదాసు శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికిరాలేదని, బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్. రామకృష్ణ తెలిపారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు అరెస్టు



నరసన్నపేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి



వజ్రపుకొత్తూరు: పర్యటిస్తున్న శిరీష

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి పాలనలో రాష్ట్రం తిరోగమనం పాలైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లిపర్తి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల పూర్తయిందని రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, సనపల చెల్లం నాయుడు, టిడిపి నాయకులు శెట్టి నరసింగరావు, దేశీలంక రమణ, నేతింటి జ్యోతి, బాగాది శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కవిటి: టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆరోగ్యానికి ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని, ఆయన ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బంది కలిగినా జైలు గోడలు కూడా టిడిపి శ్రేణులను ఆపలేవని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ వైసిపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ చంద్రబాబు పులివెందులలో ఏర్పాటు చేసిన సభకు జనాలు రావడం, యువగలం పాదయాత్రకు అనూహ్య స్పందన రావడం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రకు జనాలు తండోపతండాలుగా రావడం చూసి జగన్‌కు చెమటలు పట్టాయని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. దీంతో ఓటమి భయం పట్టుకున్న ముఖ్యమంత్రి అరెస్టులతో ప్రతిపక్షాలను బయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బెందాలం విజయ్, శ్రీను, పిరియా శివాజీ పాల్గొన్నారు.

నరసన్నపేట : ప్రజా నాయకుడు చంద్రబాబు నాయుడుని అక్రమ కేసులు పెట్టి 34 రోజులు జైలుకు పరిమితం చేసిన జగన్మోహన్ రెడ్డి కనీసం అక్కడ సదుపాయాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడం ఒక దుర్మార్గపు చర్యని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. శుక్రవారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు నాయుడుకి దీర్ఘకాలంగా ఉన్న చర్మ సంబంధిత వ్యాధి కారణంగా ఆయన వేడి నీళ్ల అడిగినప్పటికీ వైసిపి ప్రభుత్వం పట్టించుకుందా అని ప్రశ్నించారు. 40 ఏళ్లకుపైగా రాజకీయ జీవితం, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడుని అన్యాయంగా అరెస్ట్ చేశారన్నారు. ఇటువంటి చర్యలన్నీ తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో కావాలనే జరుగుతున్నాయని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే అర్థమవుతుందని, నిన్న చంద్రబాబు నాయుడుకి టెస్టులు చేసిన డాక్టర్లు కాకుండా జైలు సూపరిండెంట్ హెల్త్ రిపోర్ట్ విడుదల చేయడం దేనికి సంకేతమని అన్నారు. చంద్రబాబునాయుడు ఆరోగ్యంపై పబ్లిక్‌లో ఎమోషన్ రాకుండా జగన్మోహన్ రెడ్డి డ్రామా అడుతున్నారన్నారు. చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించి ఆయన కోలుకునేంత వరకు ఆస్పత్రిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖరరావు, మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ గోద్దు చిట్టిబాబు, సీనియర్ నాయకులు బైరి భాస్కరరావు, బగ్గు గోవిందరావు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, సరిపల్లి మధు, బలగ ప్రహర్ష, రావాడ కృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టు చేసిందే కాకుండా వైద్యపరంగా జాగ్రత్తలు తీసుకోవడం లేదని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు మెండ దాసునాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు స్కిన్ అలర్జీ వచ్చిందని, డీహైడ్రేషన్‌కు గురై 5 కేజిలు తగ్గారని తెలిసి ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత బొమ్మాళి టిడిపి అధ్యక్షుడు జీరు భీమారావు, కుచెట్టి కాంతారావు, బెండి అరుణ్ కుమార్, సూరాడ రాయుడు, నాలుగు మండలాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో సేకరాపురం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు కలమట వెంకట రమణమూర్తి శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లను అందజేశారు. రాష్ట్రంలో అరాచకాలకు అదుపు లేదన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మోసపూరిత విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, మాజీ సర్పంచ్ గోక మోహనరావు, పరమేశ్వర్ రెడ్డి, పడాల శ్రీను, ఒట్టి కోళ్ల చక్రి, గోక వనజాక్షి, సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రాబోయే ఎన్నికలకు ఓటర్ల పరిశీలన అత్యంత కీలకమైనదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని గోవిందపురం గ్రామ పంచాయతీలో క్లస్టర్-10లో యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ డైవర్ట్ రాజకీయాలకు వైసిపి నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల్లో సమస్యలను సృష్టించి ఓటర్ జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్క కార్యకర్త ఓటరు జాబితాపై అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఎప్పటికప్పుడు ఓట్లు తీసివేతలు కూడికలపై జాగ్రత్త వహించాలని, అనుమానం వచ్చినప్పుడు పార్టీ కార్యాలయానికి సమాచారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. గోవిందపురం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం టిడిపి అధినేత చంద్రబాబుపై చేస్తున్న కక్ష పూర్తి చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, మండల టిడిపి అధ్యక్షుడు మోహనరావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు వసంత స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఈశ్వరరావు, ఎంపిటిసి చిట్టిబాబు, ఎంపిటిసి ప్రతినిధి గౌరకల వసంతరావు, గోవింద, పాపారావు, రమణ, చింత నారాయణ, కొత్తూరు అప్పారావు, యోగేష్, శోభారాణి, బమ్మిడి భాస్కరరావు, రాజారావు, ఆనంద్, రమణ, జోగారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస: కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవికుమార్



పొందూరు : బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

పలాస :టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి 34 రోజులుగా జైలుకే పరిమితం చేసిన జగన్ రెడ్డి అక్కడ కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఇబ్బందులు పాల్జేయడం దుర్మార్గపు చర్యని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లు కలిగిన చంద్రబాబుని ఆరోగ్యపరంగా దెబ్బకొట్టి ప్రజాక్షేత్రంలో రానివ్వకుండా ఉండేందుకు జగన్మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నాడన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యాన ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, చిట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాక గ్రామంలో శుక్రవారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు, రాపాక క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతాడ కృష్ణవాసుదేవరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి నాయకులు కొంచాడ అప్పలనాయుడు, పారంనాయుడు, సన్యాసిరావు, మనోహరరావు, చింత మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు



నారాయణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణమూర్తికి సిల్వర్ అవార్డు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రావివలస ఉపాధ్యాయుడు నారాయణమూర్తి అంతర్జాతీయ చిత్రకళ అవార్డు హైదరాబాద్ చెందిన కాసుల చిత్రకళ అకాడమీ జూన్, జూలై నెలలో నిర్వహించిన ఆన్లైన్ చిత్రకళ పోటీల్లో రావివలస ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు మార్పు నారాయణమూర్తికి సిల్వర్ అవార్డు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. హైదరాబాద్ కాసుల చిత్ర అకాడమీ పంపించారు. అలాగే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష పే కార్యక్రమానికి పాల్గొన్నందుకు భారత ప్రధానమంత్రి నుండి ప్రశంసాపత్రం కూడా అందుకోవడం జరిగిందన్నారు. నారాయణమూర్తి మాస్టారు ఏ ఒక్క కళకు పరిమితం కాదని, ఆయన చిత్రకళ, మిమిక్రీ నాట్య కళ, వ్యాఖ్యాత, శిల్పకళా వంటి ఎన్నో కళలు ఆయన సొంతమని కొనియాడుతూ ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఇకి మొక్కను అందిస్తున్న కాంట్రాక్టర్

విద్యుత్ శాఖ ఎస్ఇకి అభినందనలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

శ్రీకాకుళం విద్యుత్‌శాఖ ఎస్ఇగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తిని శుక్రవారం ఎపి స్టేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉర్జాన విశ్వనాథం, టెక్కలి విద్యుత్ కాంట్రాక్టర్ బెండి శ్రీను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పరిధిలోని పలు అంశాలపై మాట్లాడారు.



యుగంధర్‌తో మాట్లాడుతున్న సాయిరాజ్

సాయిరాజ్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

మండల జెఎసి చైర్మన్, వైసిపి నాయకుడు జల్లు యుగంధర్ తండ్రి జల్లు జగ్గారావు ఆనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ యుగంధర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు సర్పంచ్ ప్రతినిధి బెందాలం జయప్రకాష్, పండి దేవేంద్రమూర్తి, బదకల భాస్కరరావు, జల్లు నరేష్ ఉన్నారు.

పరమేశ్వరరావుకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శ్రీకాకుళం జిల్లా నూతన డిసిసి అధ్యక్షునిగా నియమితులైన పేడాడ పరమేశ్వరరావుకి ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ పాత్రికేయునిగా, రచయితగా, ప్రజా ఉద్యమాలు, ప్రజా సంఘాలు నాయకునిగా పేడాడకి మంచి పేరుందన్నారు. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు.

'బిజెపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బిజెపి బలోపేతానికి కృషి చేయాలని విజయనగరం జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి ఆదేశాల మేరకు గురువారం ప్రకటించిన విజయనగరం జిల్లా బిజెపి పధాధికారుల నియామకంలో లావేరు మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్న ఇజ్జాడ శ్రీనివాసరావు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రణస్థలం పంచాయతీ బావరాజుపాలెంకు చెందిన జిల్లా కార్యదర్శి నుండి ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపిడిఒ పి.వి. రత్నం, బంటుపల్లి గ్రామానికి చెందిన మన్నె సురేష్ కుమార్, జిల్లా ఎస్‌సి మోర్చా అధ్యక్షులుగా రెండోసారి టొంపల అప్పలరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఇఆర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో ప్రజల్లో బిజెపి విశ్వాసంతో ఆదరణ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లావేరు మండల పధాదికారులు, మోర్చాల అధ్యక్షులు, బూత్ కమిటీ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఎన్ఇఆర్‌కి కతజ్ఞతలు తెలిపారు.

వరిలో ఆకుముడత పురుగు గుర్తింపు

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని బంటుపల్లి గ్రామంలో చేప ఈశ్వరరావు ఏడెకరాల వరిలో ఆకు ముడత పురుగు గమనించడం జరిగిందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆకుముడత పురుగు నివారణ నిమిత్తం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఏడెకరాలకు ఐదు కిలోల వేపాకులు, ఐదు కిలోల కానుగాకు, ఐదు కిలోల విషముసిడాకు, ఐదు కిలోల సీతాఫలం, ఐదు కిలోల నేరడాకు తీసుకుని ఒక పెద్ద పాత్రలో 70 లీటర్ల నీటిని తీసుకుని అందులో వేసి మూడు లేదా నాలుగు పొంగులు వచ్చేవరకు మరగబెట్టి బాగా చల్లారిన తర్వాత వడపోసి ఏడెకరాలకు సరిపడు నీటిలో కలిపి పిచికారి చేసుకున్నట్లయితే ఆకుముడత పురుగును నివారించవచ్చునని కషాయం తయారు చేసి రైతులకు సూచించారు. అలాగే ఒక ఎకరా సుడిదోమ నివారణ నిమిత్తం తూటికాడి కషాయం కూడా రైతుల సమక్షంలో తయారు చేయించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రస్తుతం వరిలో సుడి దోమ నివారణకు, ఆకుముడత నివారణకు కషాయాలను తయారు చేసుకోవాలనుకున్న వారు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కలివరపు శివశంకర్, సూర్యకాంతం, రామలక్ష్మి, సత్య నారాయణ, సునీత, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ఎపి మోడల్ స్కూల్ ఆవరణలో ఐదు సెంట్లు విస్తీర్ణంలో ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ సమక్షంలో ఎటిఎం మోడల్ పద్ధతిలో కూరగాయల సాగు ప్రాధాన్యతను ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్లో ఉండే విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలను పండించి మంచి సమగ్ర పోషకాల ఆహారాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వవచ్చునన్నారు. ప్రతి విద్యార్థి ఇంటి ఆవరణంలో ఖాళీ స్థలం ఉన్నట్లయితే ఈ పద్ధతుల్లో ప్రతి ఒక్కరూ కూరగాయలను వేసుకుంటారని, రసాయన ఎరువులు,వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించాలని క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సువారి సన్యాసిరావు, కొయ్యాన రాంబాబు, సురేష్, కలివరపు శివశంకర్, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి, ఈ నెలాఖరికి పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు బాధ్యత తీసుకుని, ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారుర్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

బి.రాజేరు సర్పంచ్‌కు సతీ వియోగం

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు పంచాయతీ సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ భార్య సన్యాసమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి విశాఖలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మరణించారు. శుక్రవారం ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన బి.రాజేరు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య, మాజీ మంత్రి పడాల అరుణ, టిడిపి రాష్ట్ర నాయకులు కరణం శివరామకృష్ణ, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు రాపాక సూర్యప్రకాశరావు, బుద్దరాజు నరసింహవర్మ, బాలాజీ, కొరుపోలు రమేష్ కుమార్, బొద్దల చిన్నం నాయుడు నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణకు ధైర్యం చెప్పారు.

పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిద్దాం

ప్రజాశక్తి- పలాస

పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిద్దామని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ పాలస్తీనాను దురాక్రమాలకు గురిచేస్తుందని ఈ దురాక్రమాన్ని ఖండించాలని కోరారు. శుక్రవారం పలాసలో సూది కొండ ఏరియాలో పాలస్తీనకు సంఘీభావంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్‌లో జరుగుతున్న వరుస దాడులను ఐక్యరాజ్యసమితి ఖండించిందని గుర్తుచేశారు. గజాలో పసిపిల్లలకు ఆహారం, వైద్యం, పాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఇలాంటి దిగ్బంధనలు నేరమని చట్ట విరుద్ధమని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సమాజం ఇటువంటి దురాక్రమం ఖండించాలని, బాధితులుగా ఉన్న పాలస్తీనాకు అండగా మూడవ ప్రపంచ దేశాలు నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత్ కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టియు) జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, కో-కన్వీనర్ కూర్మారావు, (ఎఐకెఎంఎస్) జిల్లా ఉపాధ్యక్షులు మామిడి భీమారావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు ,ఎఐకెఎంఎస్ నాయకులు సవర బంగ్లా కుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్, సరస్వతీ, షణ్ముఖరావు, ఆనంద్ పాల్గొన్నారు.

'స్వర్ణభారతి'లో దసరా వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థలో విజయదశమి(దసరా) వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వర్ణ భారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ పండుగులకు ఒక విశిష్ట స్థానముందని, ఈ పండగ కూడా చెడుపై మంచి సాధించినందుకు గుర్తుగా రాముడు రావణుడుపై సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. కార్యక్రమంలో చాట్ల నీలిమరెడ్డి, ప్రిన్సిపల్ ఆసీ గౌరీశంకర్ రెడ్డి, అధ్యాపక బందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.